క్లుప్తంగా

ఆలోచింపజేసిన నాటికలు



అనగనగా ఒక రాగం నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ నాటికోత్సవాల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. ముందుగా ఈ నాటిక ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి నాటికగా కోరమండల ఆర్ట్స్ సమర్పణలో అనగనగా ఒక రాగం ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా.. పిల్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు. రెండోదిగా పెందుర్తికి చెందిన నటరాజ డ్రామాటిక్ సమర్పణలో అభయారణ్యం నాటికను ప్రదర్శించారు. ఈ రెండు నాటికలు చక్కని సందేశాత్మక ప్రదర్శనలుగా నిలిచాయి.

ముడసర్లోవ పార్కు ఎదుట ధర్నా




ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకులు శుక్రవారం ముడసర్లోవ పార్కు ఎదుట ధర్నా చేశారు. సీపీఎం తూర్పు నియోజకవర్గం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, నరేంద్రకుమార్, శంకరరావు, పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో టీడీపీ నాయకులు పల్లా శ్రీనివాస్, గండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఫిల్మ్ ఫెస్టివల్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ఫుట్‌పాత్ గోడలపై అద్భుత చిత్రాలు



ఫుట్‌పాత్ గోడపై ఆకట్టుకుంటున్న చిత్రాలు



ముడసర్లోవ పార్కు ఎదురుగా దేవస్థానం గోడలపై వేసిన బొమ్మలు



విమ్స్ ఆస్పత్రి గోడపై చిత్రాలు

ఆరిలోవ: విశాఖ నగరంలో వచ్చే నెలలో జీ-20 సదస్సు జరగనుండడంతో జీవీఎంసీ అధికారులు సుందరీకరణ పనులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గోడలపై పలు చిత్రాలతో పెయింటింగ్ వేస్తున్నారు. దీంతో ఇంతవరకు నాచుపట్టి నల్లగా ఉన్న ఫుట్‌పాత్ గోడలు ఇప్పుడు రంగులతో మెరుస్తున్నాయి. హనుమంతవాక నుంచి ముడసర్లోవ మీదుగా పైనాపిల్ కాలనీ దాటి అడవివరకు ఓ పక్క సింహాచలం దేవస్థానం గోడలు, మరో పక్క జీవీఎంసీ గోడలతో పాటు హనుమంతవాక నుంచి పెదగదిలి వరకు విమ్స్ గోడపై వివిధ రకాల బొమ్మల పెయింటింగ్ వేశారు. ఈ గోడలపై పల్లెటూరు అందాలు, వ్యవసాయం, పంటలు, నదులు, కొలనులు, పక్షులు, వన్యప్రాణుల బొమ్మలతో పాటు కళాకారుల నృత్యాలు చేస్తున్నట్లు, యోగాసనాలు వేస్తున్నట్లు బొమ్మలు వేశారు. అటుగా వెళ్లే ప్రయాణికులను అందమైన ఈ బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. ఈ బొమ్మలతో ముడసర్లోవ ప్రాంతానికి కొత్తదనం వచ్చిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో పలు చిత్రాలతో ఆకట్టుకుంటున్న దేవస్థానం గోడ

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అపోలో వైద్యులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్, శ్రీనివాసరావు తదితరులు

ఆరిలోవ: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండడం అవసరమని అపోలో అంకాలజీ విభాగం వైద్య నిపుణుడు డాక్టర్ సుమన్ దాస్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించగలిగితే నయం చేయడం సులువన్నారు. అంకాలజీ వైద్యులు చంద్రకల్యాణ్, రమేష్, రాకేష్‌రెడ్డి, జయశ్రీ, ఆదిత్యనారాయణ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి నివారణకు అవసరమైన జాగ్రత్తల గురించి తెలియజేశారు. క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ప్రాథమిక దశలోనే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించవచ్చన్నారు. అవగాహన లేకపోవడంతో క్యాన్సర్ 3, 4 దశలకు చేరి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని హెచ్చరించారు. వాతావరణ కాలుష్యం, లైఫ్‌స్టైల్, రివర్స్ పొగ తాగడం, వంటల్లో ఒకసారి వినియోగించిన నూనెను మళ్లీ వాడటం, తదితర వాటి వల్ల క్యాన్సర్ రావడానికి అవకాశం ఉందన్నారు. శరీరంలో ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చని తెలిపారు.

సమత కళాశాలలో అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత కళాశాలలో శుక్రవారం క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, అపోలో హాస్పటల్ క్యాన్సర్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. క్యాన్సర్ చికిత్సలో పెద్ద ఎత్తున సాంకేతికత అందుబాటులోకి వచ్చిందన్నారు. ముందస్తు నిర్ధారణ, సరైన చికిత్స ద్వారా క్యాన్సర్ జయించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో రాజేష్‌కుమార్, జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా పట్టణీకరణ జరగాలి



సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

ఏయూ క్యాంపస్: పర్యావరణ హితంగా పట్టణీకరణ జరగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఏయూ జాగ్రఫీ విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ×అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇన్ ది 21 సెంచరీస్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ 2035 నాటికి భారతీయ జనాభాలో 50 శాతం మంది పట్టణాల్లో నివాసాన్ని ఏర్పరుచుకుంటారన్నారు. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ పట్టణాలకు వలసలు పెరుగుతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో విశ్వవిద్యాలయంలో విభిన్న రంగాలలో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నామన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో నిపుణులు అందించే సూచనలు నివేదిక రూపంలో తమకు అందించాలని, విశాఖ నగరాభివృద్ధిలో వీటిని భాగం చేస్తామన్నారు. ఇటీవల ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం ప్రత్యక్షంగా ఏయూ ప్రాంగణాన్ని చూసి సంతోషం వ్యక్తం చేసిందన్నారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, అలహాబాద్ వర్సిటీ జాగ్రఫీ విభాగ ఆచార్యులు హెచ్.ఎస్.మిశ్ర, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.వెంకటకృష్ణ, విభాగ ఆచార్యులు పి.సునీత, ఆచార్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

సంప్రదాయ కళలకు సంపూర్ణ ప్రోత్సాహం

- ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సంప్రదాయ కళలైన సంగీతం, నృత్య విభాగాలకు సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ సంగీత విభాగం సమావేశ మందిరంలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావులపై నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు సంగీతం ఎంతో దోహదపడుతుందన్నారు. సాలూరి రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు సంగీత దిగ్గజాలుగా నిలుస్తారన్నారు. వీరు ఉన్నత స్థానానికి చేరుకోవడం వెనుక ఉన్న కృషి, సాధనను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సినీ రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సాధించిన సాలూరి, ఘంటసాల మన తెలుగువారు కావడం గర్వకారణమన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచే వ్యక్తులపై సదస్సు నిర్వహిస్తున్న విభాగ ఆచార్యులను అభినందించారు. విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఎదిగి అపూర్వ చిత్రాలకు సంగీతం, గాత్రం అందించిన మహనీయులను నేటి తరానికి తెలిపే విధంగా రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్ సంగీత కళాశాల లెక్చరర్ బి.ఎ నారాయణ, విభాగ ఆచార్యులు సరస్వతి విద్యార్థి, విశ్రాంత ఆచార్యులు మండపాక శారద తదితరులు ప్రసంగించారు. అనంతరం బి.ఎ నారాయణను వర్సిటీ తరఫున సత్కరించారు.

నేడు ఎంవీపీ శివాలయానికి కంచికామకోటి పీఠాధిపతి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లోని శ్రీసిద్ధి వినాయక పార్వతీ ముక్తేశ్వర ఆలయాన్ని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ శనివారం సందర్శించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ కార్యదర్శి బుచ్చిలింగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం ఆలయంలో జరిగే పలు పూజా కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేయనున్నారని తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామీజీ ఆశీస్సులు పొందాలని కోరారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు



గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్.విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహార్‌దగా, లతేహార్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీయువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కైలాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు మనోధైర్యమే చికిత్స

- తొలి దశలో గుర్తిస్తే నివారణ సులువు
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం



మహారాణిపేట: వైద్య విజ్ఞానం ఎంతగానో అభివృద్ధి చెందినా ఇప్పటికీ తెలిసిన వారికి, బంధువులకు క్యాన్సర్ అని తెలిస్తే... ఒళ్లు జలదరిస్తుంది. ఎన్నో సందేహాలు, భయాలు, అనుమానాలు వెంటాడుతుంటాయి. తొలిదశలోనే గుర్తించి, మనోధైర్యంతోడైతే క్యాన్సర్‌ను జయించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఏటా ఫిబ్రవరి 4న పలు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం క్యాన్సర్‌కు ఉచిత చికిత్స కూడా అందిస్తున్నాయి. విశాఖ జిల్లాలో కేజీహెచ్‌తో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు చికిత్స అందుబాటులో ఉంది. దీంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా బాధితులు చికిత్స కోసం విశాఖ వస్తున్నారు. గతంలో ఏడాదికి 1500 నుంచి 2 వేల వరకు కేసులు వచ్చేవి. ఇప్పుడు ఏడాదికి 12 వేల నుంచి 15 వేల వరకు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కేజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ

ప్రస్తుతం కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు వారానికి మూడు రోజుల పాటు ఓపీ నిర్వహిస్తున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిల్పా ఈ ఓపీ నిర్వహిస్తున్నారు. ఆయా రోజుల్లో 125 నుంచి 150 వరకు బాధితులు వస్తున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేజీహెచ్‌లో సీఎస్ఆర్ బ్లాక్ మొదటి అంతస్తులో వార్డును ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డును కూడా ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు వైద్య సేవలు అందించేలా అధునాతన పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. క్యాన్సర్‌కు భయపడవలసిన పరిస్థితి లేదు. నివారణ సాధ్యమే. మనోధైర్యంతో ముందుకు వెళ్తే సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడవచ్చు.

– డాక్టర్ శిల్ప, క్యాన్సర్ వైద్యురాలు, కేజీహెచ్

జీవన శైలిలో మార్పులు అవసరం



వివిధ కారణాల వల్ల క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. జీవన శైలిలో మార్పులు రావడం, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వల్ల కూడా క్యాన్సర్ సోకుతుంది. ఇప్పుడు క్యాన్సర్ వ్యాధిపై భయపడవలసిన అవసరం లేదు. ఎంతో మందికి చికిత్స అందిస్తున్నాం. వారికి తగ్గుముఖం పడుతోంది. పూర్వ స్థితికి వస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి.

– డాక్టర్ మురళీకృష్ణ, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, ఎంవీపీ కాలనీ

తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే



తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారణ చేయడానికి వీలు ఉంటుంది. ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రతి మనిషి తన జీవన శైలిలో వ్యాయామం తప్పకుండా చేయాలి. ఎంతో మంది క్యాన్సర్‌ను జయించి సాధారణ జీవితం గడుపుతున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ, విశాఖపట్నం

అందుబాటులో ఆధునిక చికిత్స



క్యాన్సర్ వ్యాధి బారిన పడితే చనిపోతామన్న భయం ప్రజల్లో ఎక్కువగా ఉంది. కానీ ఇప్పుడు ఆధునిక చికిత్స విధానం అందుబాటులోకి వచ్చింది. ప్రాథమిక దశలో గుర్తించి తగిన వైద్యం తీసుకుంటే కోలుకోవచ్చు. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ బారిన ఎక్కువ మంది మహిళలు పడుతున్నారు. వీటిని కూడా తొలి దశలో గుర్తించే ఆధునిక పరికరాలు వచ్చాయి.

– డాక్టర్ రఘునందరావు, వ్యవస్థాపక డైరెక్టర్, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, అగనంపూడి

ఏయూ సమాచారమ్

ఫైన్ ఆర్ట్స్ విభాగం సందర్శన



చిత్ర కళావిభాగాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

ఏయూ క్యాంపస్: శివాజీపాలెంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాన్ని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు శుక్రవారం సందర్శించారు. విభాగం విద్యార్థులు తయారు చేసిన రాతి, చెక్క బొమ్మలు, పెయింటింగ్ చిత్రాలు, శిల్పాలు, ఆర్ట్స్ గ్యాలరీ, స్టూడియోలను తిలకించి, అవి తయారు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చాలా బాగున్నాయని కమిషనర్ అభినందించారు. వీటిని సందర్శకులకు అందుబాటులో ఉంచితే బాగుంటుందని చెప్పారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య డి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ అక్వేరియంలో బధిర చిన్నారుల సందడి



టన్నెల్ అక్వేరియంలో బధిర చిన్నారులు

ఏయూ క్యాంపస్: బీచ్ రోడ్డులోని ఏయూ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌లో శుక్రవారం సాయంత్రం బధిర (మూగ, చెవిటి) చిన్నారులు సందడి చేశారు. వివిధ రకాల రంగులతో కూడిన మత్స్య సంపదను అండర్ వాటర్ టన్నెల్‌లో వీక్షించిన చిన్నారులు మంత్రముగ్ధులయ్యారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు రాజారెడ్డి వారికి ఉచిత ప్రవేశంతో పాటు అక్కడ తినుబండారాలు, జెయింట్ వీల్, హార్స్ రైడింగ్, డ్రాగన్ ట్రైన్, వంటి ఉత్సాహాన్ని నింపే రైడ్‌లను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ పావని ఇన్‌స్టిట్యూట్ ఫర్ మల్టీపుల్ హ్యాండీక్యాప్డ్ స్పాస్టిక్స్ చిన్నారులు సుమారు 100 మంది వరకు ఎగ్జిబిషన్‌ను ఉచితంగా సందర్శించారన్నారు. వేసవి వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలతో పాటు పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగర సుందరీకరణకు సహకరించాలి

ఎంవీపీ కాలనీ: నగర సుందరీకరణకు ఏయూ ఆచార్యులు, పరిశోధకులు పూర్తి సహకారం అందించాలని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు కోరారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన ఆయన జాగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న సదస్సులో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయనను కలిసేందుకు వచ్చిన వర్సిటీ ఆచార్యులు, విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర సుందరీకరణకు జీవీఎంసీ యంత్రాంగం పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఈ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై పూర్తి మద్దతు అందించాలన్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణానికి జరిగే హాని పట్ల విద్యార్థుల్లో చైతన్యం తేవాలన్నారు. బయట సమాజంలో సానుకూలత కలిగించేందుకు వర్సిటీ ఆచార్యులు, విద్యార్థుల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వెంకటకృష్ణ, ఆచార్య హరికృష్ణ, డాక్టర్ దొరబాబు, పితాని ప్రసాద్, డాక్టర్ శాంతారావు, డాక్టర్ రమేష్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ గంగరాజు, డాక్టర్ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్యానంద జయంత్యుత్సవాలు



పూజలు చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు

ఆరిలోవ: నిత్యానంద జయంత్యుత్సవాలను శుక్రవారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. నిత్యానంద భగవంతుని దివ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించినట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా తొలుత స్వామికి మహాభిషేకం చేశారు. సప్త నదులైన గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరిల నుంచి సేకరించిన పవిత్ర జలాలతో నిండిన 108 కలశాలతో అభిషేకం జరిపారు. పంచామృత, పంచగంధ్య, సువాసనలతో కూడిన పుష్పాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ఇందులో భాగంగా భక్తులు హరేకృష్ణ సంకీర్తనలతో తన్మయత్వం చెందారు. స్వామివారికి 58 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ భక్తదాస భక్తులకు ఉపదేశం చేశారు. నిత్యానంద ప్రభువు ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో కుల, మత, జాతి, ప్రాంత, లింగ బేధాలతో గొడవలుపడుతున్నారన్నారు. దీంతో సమాజంలో ప్రశాంతత లేకుండాపోయిందని చెప్పారు. ప్రతి ఒక్కరిలో భక్తి భావం కలిగినప్పుడే ప్రశాంతత చేకూరుతుందన్నారు.

సందర్శకులకు అనుకూలంగా..



జూలో ఎన్‌క్లోజర్లు, రోడ్డు మధ్య మట్టితో చదును చేసిన స్థలం

ఆరిలోవ: జూలో సందర్శకులకు అనుకూలంగా రహదారులు సిద్ధం చేస్తున్నారు. జూ లోపల చుట్టూ సందర్శకులు నడవడానికి గతంలో నిర్మించిన తారు రోడ్డు ఉంది. ఆ రోడ్డుకు ఇరువైపులా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. సందర్శకులు ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వన్యప్రాణులను చూడాలి. ఇక్కడ ప్రతి చోటా రోడ్డుకు, ఎన్‌క్లోజర్లకు మధ్యలో విశాలమైన ఖాళీ స్థలం ఉంటుంది. ఈ ఖాళీ స్థలం రోడ్డు కంటే దిగువన లోతుగా ఉండడం, కొన్ని చోట్ల గోతుల పడి అధ్వానంగా తయారు కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లేటప్పుడు పిల్లలు, వృద్ధులు పడిపోతున్నారు. ఇప్పుడు జూ అధికారులు అన్ని ఎన్‌క్లోజర్ల ముందు రోడ్డు పక్కన ఖాళీ స్థలాన్ని మట్టితో పూడ్చుతున్నారు. మట్టి వేసి చదును చేయడంతో ఎన్‌క్లోజర్ల వద్దకు వెళ్లి వన్యప్రాణులను చూడడానికి వీలుగా తయారు చేస్తున్నారు. దీంతో సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

- వర్సిటీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించాలి
- ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్-2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందన్నారు. భవిష్యత్ అంతా సాంకేతిక విప్లవం, సవాళ్లకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి అనుగుణంగా యువతరం తమను తాము మెరుగుపరచుకోవాలని సూచించారు. ఏయూలో స్కూల్స్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని స్కూల్‌గా మార్పు చేస్తామన్నారు. నూతనంగా ఇంక్యుబేషన్ సెంటర్ నెలకొల్పి, స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహిస్తామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సింహపురి వర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు, చార్టెడ్ అకౌంటెంట్ ఆకుల చంద్రశేఖర్, పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య డి.ప్రభాకరరావు, ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కష్ణమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

కేశాల విరాళం అభినందనీయం

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



క్యాన్సర్ రోగులకు కేశాల విరాళం ఇచ్చిన వారితో మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కేశాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో కేశాల విరాళ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు నగరానికి చెందిన కొందరు మహిళలు వారి కేశాలు విరాళంగా అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి ఆధునిక పద్ధతుల్లో అన్ని రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతో ఉండాలని.. అలాంటప్పుడే వ్యాధిని అధిగమించగలరన్నారు. హెచ్‌సీజీ అంకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.